

సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యలతో మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల బృందం

సీఎం ప్రజావాణిని సందర్శించిన మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల బృందం

బేగంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ముఖ్యమంత్రి ప్రజావాణిని మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్స్ బృందం సందర్శించింది. ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లతో బృందం సభ్యులు భేటీ అయ్యారు. సీ.ఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి పని తీరు చాలా బాగుందని, ఇలాంటి విధానాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు తమ రాష్ట్ర ఉన్నత అధికారులకు సిఫారసు చేస్తామన్నారు. ఇది ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమమని పేర్కొన్నారు.

297 దరఖాస్తుల స్వీకరణ

మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి మొత్తం 297 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో దివ్య దేవరాజన్ ఫోన్‌లో మాట్లాడి కొన్నింటిని పరిష్కరించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 69, రెవెన్యూకు 48, విద్యుత్‌కు 33, పౌరసరఫరాకు 7, ఇందిరమ్మ ఇళ్ల కోసం 45, ఇతర శాఖలకు సంబంధించి 95 దరఖాస్తులు వచ్చినట్లు అధికారి తెలిపారు.

ఈ-పెట్టీ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

బేగంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బేగంపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ-పెట్టీ కేసులో ముగ్గురికి జైలు శిక్ష పడింది. వివరాలిలా.. పాటిగడ్డలోని ఎస్‌బీటీనగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్ (21), ఎండీ సల్మాన్ (24), మోసిన్ (25)లు ఆదివారం ఆ ఏరియాలోనే బహిరంగంగా మద్యం తాగారు. దీనిపై ప్రశ్నించిన స్థానికులపై దౌర్జన్యానికి యత్నించడంతో పాటు ఈ ప్రాంతానికి చేరుకున్న పోలీసులతో కూడా దురుసుగా వ్యవహరిస్తే అదుపులో తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని సికింద్రాబాద్‌లోని 16వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట వారిని హాజరుపరిచారు. 4 రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.1100ల జరిమానా విధించారు.

వేర్వేరు చోట్ల రెండు బైక్‌ల చోరీ

బేగంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లో వేర్వేరు సంఘటనల్లో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సార్టీకి కాలనీకి చెందిన జశ్వంత్ గత నెల 18న ఇంటి వద్ద బైక్ పార్క్ చేశారు. మరుసటి రోజు ఉదయం కనిపించలేదు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో సంఘటనలో నిజాంపేటకు చెందిన బల్లా హరీష్ గత నెల 15వ తేదీ రాత్రి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను ఎర్రగడ్డ మెట్రోస్టేషన్ సమీపంలో పార్క్ చేసి కూరగాయాల మార్కెట్ లోపలకు వెళ్లి వచ్చే లోపు వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల వారిని అడిగినా ఫలితం లేకపోవడంతో వెంటనే సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సెంట్రల్ సిల్క్ బోర్డు ప్రతినిధులు మధుకుమార్, అలీ

పట్టు పురుగులు, సిల్క్ తయారీపై అవగాహన

బంజారాహిల్స్, జూలై 8(ఆంధ్రజ్యోతి): శ్రీనగరకాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిల్క్ ప్రదర్శనలో మంగళవారం పట్టు పరిశ్రమపై సెంట్రల్ సిల్క్ బోర్డ్ ప్రతినిధులు మధుకుమార్, అలీ.. గ్రోయింగ్ రూట్స్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టు పురుగులు, సిల్క్ రకాలు, ఏ ప్రాంతంలో ఎలాంటి సిల్క్ ఉత్పత్తులు ఉంటాయో, సిల్క్ మార్క్ వేసిన నాణ్యమైన పట్టు వస్త్రాలను చూపించి పలు అంశాలను వివరించారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సిల్క్ వస్త్రాలు, వాటిప్రాముఖ్యత గురించి తెలిపారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీలో చేనేతకారుల సిల్క్ ఉత్పత్తుల్లో సిల్క్ బోర్డ్ ఆమోదించిన వాటిని మాత్రమే వినియోగదారులకు అందిస్తారని, ప్రతిఒక్కరూ చేనేతకారుల ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ సిల్క్ బోర్డ్ సభ్యులు, నిర్వాహకులు వినయ్ కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌రోడ్డు నంబర్ 12లో కొత్తగా నిర్మిస్తున్న మహిళా భవన్‌ను నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి మంగళవారం పరిశీలించారు. బంజారాహిల్స్, జూలై 8(ఆంధ్రజ్యోతి)

మహిళలకు ప్రభుత్వం అండ

బోరబండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని బోరబండ డివిజన్ కార్పొరేటర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్ అన్నారు. సైట్-1 కాలనీ షహీద్ తుర్రేబాజ్ ఖాన్ కమ్యూనిటీహాలులో మంగళవారం జరిగిన ప్రత్యేక పట్టణ మహిళా సమాఖ్య సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలకు రావాల్సిన వడ్డీ లేని రుణాలను 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వము ఈ వారంలో జమ చేయనున్నట్లు వెల్లడించారు. వార్డు స్థాయిలో సమైక్య సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాల అంశాన్ని అందరికీ తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో మంజూరైన వడ్డీ లేని రుణాల చెక్కులను త్వరలోనే నియోజకవర్గం వారీగా పంపిణీ చేపడతామని చెప్పారు. జీహెచ్ఎంసీ సర్కిల్-19 డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్ రావు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, యూసీడీ సిబ్బంది, టీఎల్.ఎఫ్. అధ్యక్షురాలు, సమైక్య అధ్యక్షురాళ్లు, ఆర్.పిలు పాల్గొన్నారు.

సీఎంపై వ్యాఖ్యలకు ఖండన

పంజాగుట్ట, జూలై 8(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు రోజురోజుకూ పిచ్చి ముదిరిపోతుందని, ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై నిందలు వేయడం పరిపాటిగా మారిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. రేవంత్ రెడ్డి కాదు కేటీఆర్ క్షమాపణ చెప్పాలని, ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. మంగళవారం సమావేశం పెట్టి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ను కేటీఆర్ అపవిత్రం చేసినందుకు వారు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. అనంతరం టీపీసీసీ మీడియా సమన్వయకర్త శ్రీకాంత్ యాదవ్, చాంద్రాయణగుట్టకు చెందిన కాంగ్రెస్ నాయకుడు బోయ నగేష్, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షుడు నారికెళ్ల నరేష్, ఖైరతాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హరిధర్, తదితరులు మాట్లాడారు. కేటీఆర్ ప్రెస్‌క్లబ్‌కు వచ్చి రేవంత్ ఢిల్లీకి పారిపోయాడని వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్యాలెస్ బాబు కేటీఆర్ యేనని రేవంత్ రెడ్డి కాదన్నారు. సమావేశంలో నాయకులు పరమేష్ యాదవ్, కాటూరి రమేష్, బి.వెంకటేష్, దేవేందర్‌రెడ్డి, రవి, జగన్‌యాదవ్, ఖాదీమ్, బోయ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆగని నీటి దందా



సున్నంచెరువు వద్ద నీటిని నింపుకొంటున్న ట్యాంకర్లు

నీటి దందా యథేచ్ఛగా సాగుతోంది. వద్దు ఇది కాలుష్య కారక నీరు.. ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతాయని హెచ్చరించినా బేఖాతరు చేస్తున్నారు. ఇటీవల అక్రమ బోర్లు, పైపులు ధ్వంసం చేసినా కేసులు పెట్టినా నిర్వాహకుల తీరులో మార్పు శూన్యం. ఇప్పటికీ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తుండటం అందుకు నిదర్శనం. అవసరాన్ని ఆసరాగా చేసుకొని మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా దందా నడిపిస్తున్నారు.

- కాలుష్య కారక నీరంటూ పొల్యూషన్ బోర్డు అధికారుల హెచ్చరిక
- కేసు పెట్టినా.. మారని ట్యాంకర్ నిర్వాహకుల తీరు
- యథేచ్ఛగా నీటి వ్యాపారం
- హాస్టల్స్, హోటల్స్, ఫంక్షన్‌హాల్స్‌కు నిత్యం సరఫరా
- ప్రజారోగ్యంతో చెలగాటం

హైటెక్ సిటీ, జూలై 8 ఆంధ్రజ్యోతి): మాదాపూర్ గుట్టల బేగంపేట్ పరిధిలోని సున్నంచెరువు, నవభారత్ నగర్ వద్ద ట్యాంకర్ల ద్వారా నీటి దందా నిరంతరం కొనసాగుతున్నది. సున్నం చెరువు వద్ద నీరు వాడొద్దు రోగాలు పాలవుతారంటూ పొల్యూషన్ బోర్డు అధికారులు హెచ్చరించినా, చర్మ సంబంధ వ్యాధులు వస్తాయని చెప్పినా.. ట్యాంకర్ల నిర్వాహకులు మాత్రం లాభాపేక్షే లక్ష్యంగా నీటిని తరలిస్తున్నారు. సున్నం చెరువు అభివృద్ధిలో భాగంగా హైడ్రా అధికారులు అక్కడ పనులు నిర్వహిస్తూ ఇటీవల బోర్లు, పైపులను ధ్వంసం చేశారు. అడ్డొచ్చిన వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేసినా నీటి వ్యాపారం మాత్రం సాఫీగా సాగుతోంది.

వాటికి నిరంతరం సరఫరా

బోరు నీటిని ట్యాంకర్ల ద్వారా మాదాపూర్ చుట్టుపక్కల హాస్టల్స్, హోటల్స్, ఫంక్షన్ హాళ్లకు సరఫరా చేస్తున్నారు. చుట్టూ ఐటీ సంస్థలు ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు అంతా హాస్టళ్లలోనే నివాసం ఉంటారు. దాంతో నీటికి డిమాండ్ ఏర్పడింది. అక్రమార్కులు దానిని తమకు అనుకూలంగా చేసుకొని అక్రమంగా బోర్లు వేసి కాలుష్య కారక నీటిని విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం

క్రమంగా బోర్ల ద్వారా కాలుష్య కారక నీటిని సేకరించి విక్రయిస్తున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటున్నాం. సున్నం చెరువు పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి నీటిని నింపుకొంటున్న ట్యాంకర్లను సీజ్ చేస్తున్నాం. అయినా మార్పు రావడం లేదు. ఈ నీటిని వాడటం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.....వీటిని వినియోగించుకునే వారు తమ దృక్పథాన్ని మార్చుకోవాలి. ప్రజల్లో అవగాహన తీసుకు వచ్చేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తాం.

శ్రీనివాస్, శేరిలింగంపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్



బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బంజారాహిల్స్ ఠాణా వద్ద ఎమ్మార్పీఎస్ ఆందోళన

బంజారాహిల్స్, జూలై 8(ఆంధ్రజ్యోతి): దిమ్మెకు అనుమతి లేదని జీహెచ్ఎంసీ కూల్చివేతను ఇటీవల అడ్డుకునేందుకు యత్నించిన నేతలపై అక్రమంగా కేసులు పెట్టారని బంజారాహిల్స్ ఠాణా ఎదుట ఎమ్మార్పీఎస్ నేతలు ఆందోళన నిర్వహించారు. ఈ వ్యవహారంపై న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం వారికే వినతి పత్రం సమర్పించారు. అనంతరం నగర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు టీవీ నర్సింహ మాట్లాడుతూ నగర మేయర్ ఆదేశాల మేరకే జీహెచ్ఎంసి సిబ్బంది దిమ్మెను కూల్చివేశారని ఆరోపించారు. పోలీసులు కూడా ప్రజా ప్రతినిధులకు వత్తాసు పలుకుతూ అక్రమ కేసులు పెట్టారన్నారు. ఈ విషయంపై త్వరలో నగర పోలీసు కమిషనర్‌ను కలవనున్నట్టు చెప్పారు. ఆందోళనలో ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్, ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామి, నాయకులు వెంకటస్వామి, ఖైరతాబాద్ ఇన్‌చార్జి కొండ్రపల్లి శివ, నాయకులు కండే రామ్ కుమార్ పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ గంగతెప్పోత్సవ కమిటీ ప్రతినిధులతో చైర్మన్ మెట్టు సాయికుమార్

గంగమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేయండి

ఖైరతాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని గంగపుత్రులు ఆరాధ్య దైవమైన హుస్సేన్‌సాగర్ ఒడ్డున ఉన్న గంగమ్మ దేవాలయాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయాలని గంగతెప్పోత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. మంగళవారం హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. దేవాలయ చరిత్ర, చిన్న వర్షం వచ్చినా ఆలయం మునిగిపోతున్న వైనం గురించి తెలంగాణ మత్స్య సహకార సంఘం చైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి తెప్పోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్ బాబు, ప్రతినిధులు వివరించారు. దీంతో యేటా జరుపుకొనే బతుకమ్మ ఉత్సవాల కోసం ఆలయం పక్కనున్న ఘాట్‌ను మహిళలకు అనుకూలంగా ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ప్రతినిధులు మంగళపల్లి రాజు, మల్కు విశాల్‌బాబు, బైరు హనీష్‌కుమార్ పాల్గొన్నారు.

వడ్డీ లేని రుణాలు పొందండి: కార్పొరేటర్

ఖైరతాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రమిస్తున్నారని, పొదుపు గ్రూపుల్లో ఇంకా చేరని వారిని గుర్తించి వడ్డీ లేని రుణాలు పొందేలా చూడాలని ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి సూచించారు. మంగళవారం రాజ్‌నగర్ దేవాలయంలో స్థానిక పొదుపుగ్రూపు మహిళలతో జరిగిన సమావేశంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె విచ్చేసి మాట్లాడారు. మహిళా శక్తి సంఘాలకు పెట్రోల్ బంకులతో పాటు ఇందిరా క్యాంటీన్లను ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. టాస్ ఉల్లాస్ పథకం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఇందులో మహిళలకు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై విజయారెడ్డితో పాటు ఎంటమాలజీ అధికారులు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో యూసీడీ విభాగం ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, సీవో సురేందర్, ఎంటమాలజీ విభాగం ప్రతినిధులు సుమన్ తదితరులు పాలొన్నారు.



ఘన నివాళి

వైఎస్సార్ జయంతి సందర్భంగా స్థానికంగా ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి కొండా సురేఖ, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయారెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఉమ్మడి రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.
బేగంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి):



ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సచిన్ రాథోడ్ తదితరులు

తలసానికి ఆహ్వానం

అమీర్‌పేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తలసాని యువసేన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రావాలని మంగళవారం మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసానికి ఆయన నివాసంలో బీఆర్ఎస్ నాయకుడు సచిన్ రాథోడ్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. అమీర్‌పేట జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో బుధవారం నుంచి మూడు రోజులపాటు పోటీలు జరగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, సీనియర్ నాయకులు అశోక్ యాదవ్, క్రికెట్ జట్ల కెప్టెన్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణ యజమానులపై చర్యలు తీసుకోవాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు కాంగ్రెస్ నేత ఫిర్యాదు

అమీర్‌పేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ లలో పలు అక్రమ నిర్మాణాలు చేపడుతున్న యజమానులపై, వారికి సహకరిస్తున్న పలువురు రాజకీయ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కార్యకర్తలతో కలిసి వారు ప్రజావాణిలో జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రెండు డివిజన్ లలో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శించారు. భవనానికి ఒక విధంగా పర్మిషన్ తీసుకుని ఇష్టం వచ్చినన్ని అంతస్తులు నిర్మించుకుంటున్నారన్నారు. చివరకు నాలాలను సైతం ఆక్రమించుకుంటున్నారు. అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్ఎస్ రెడ్డి, నాయకులు నవీన్ రాజ్, రాజేశ్వరీ, రజనీ కాంత్, రవీందర్, నరేష్ తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

బేగంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బేగంపేట పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతానికి చెందిన కె. దేవేందర్ కిషోర్ (54) ఈనెల 4న విజయవాడకు డ్రైవింగ్ పని మీద వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఇదే రోజు సాయంత్రం అతడి వద్ద ఉన్న ఫోన్‌కు కుటుంబసభ్యులు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఈనెల 6న కూడా తిరిగి ఇంటికి చేరలేదు. ఆయన కోసం తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం రాత్రి అతడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల ప్రారంభం

పంజాగుట్ట, జూలై 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని ఖైరతాబాద్ ప్రభుత్వ కళాశాల రీజినల్ సెంటర్ కోఆర్డినేటర్ టి.నవీన్ చందర్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ బి. రాజేంద్ర కుమార్ మంగళవారం తెలిపారు. ఆగస్టు 13వ తేదీ లోపు వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, సంబంధిత సర్టిఫికెట్స్ ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న కేంద్రానికి వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 73829-29629 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వీడియో తీసి.. స్నేహితుడికి పంపి..

- యువకుడి ఆత్మహత్య
- సనత్‌నగర్‌లో ఘటన

బేగంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చనిపోయే ముందు వీడియో తీసి స్నేహితుడికి పంపి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సనత్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పెద్ద దర్పల్లికి చెందిన చంద్రయ్య ఉపాధి కోసం నగరానికి వచ్చి ఫతేనగర్‌లోని జింకలవాడలో నివాసముంటున్నాడు. భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 15 రోజుల క్రితం భార్య, పెద్ద కుమారుడు ఊరికి వెళ్లారు. ఇంటిలో చిన్న కుమారుడు వినోద్‌కుమార్ ఒక్కడే ఉన్నాడు. ఈ క్రమంలో ఈనెల 6న వినోద్‌కుమార్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు ముందు వీడియో తీసి తన మిత్రుడు చంద్రశేఖర్‌కు పంపాడు. దీంతో ఈ విషయాన్ని వినోద్‌కుమార్ తండ్రి చంద్రయ్యకు తెలిపాడు. ఆయన ఇంటికి వచ్చే సరికి ఇప్పటికే ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని గాంధీకి తరలించారు. అయితే వినోద్‌కుమార్‌కు ఓ యువతితో పరిచయం ఏర్పడిందని, నిత్యం మద్యంతాగి వచ్చేవాడని, ఆమె వల్ల మానసికంగా కుంగిపోయాడని తండ్రి చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు ఇచ్చాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు గర్భిణులకు ఉచిత వైద్యశిబిరం

ఎర్రగడ్డ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రసవం అనేది పునర్జన్మతో సమానమని అలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా పేదవారైన గర్భిణులు ఆర్థిక స్తోమత లేక ప్రాథమిక పరీక్షలు కూడా చేయించుకోవడం లేదని, అలాంటి వారి కోసం నీలిమ హాస్పిటల్ 'నీలిమ 9' పేరుతో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తోందని ఆసుపత్రి ఎండీ నీలిమా శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రతినెలా 9న గర్భిణులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదేరోజు ఉచిత మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూలై 8(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 11కేవీ బీఎస్ఎన్ఎల్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో, 11కేవీ పీఈఎల్ ఓహెచ్, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 సాయి ఎన్ క్లేవ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ జూబ్లీహిల్స్ హెచ్‌పీ గ్యాస్, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 13 శ్రీరామ్ నగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో...

మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11కేవీ బేగంపేట చికోటి గార్డెన్స్, సెలెబ్రిటీ క్లబ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ బేగంపేట శాంతి బాగ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజన బాలుర వసతిగృహం సందర్శన

బోరబండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన బాలుర సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ఆరోగ్య నగర్.. గిరిజన బాలుర వసతి గృహాన్ని మంగళవారం వారు సందర్శించారు. హాస్టల్ వార్డెన్ సరిగా రాని కారణంగా విద్యార్థులకు సరైన సమయానికి టిఫిన్స్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందడం లేదని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ లేని కారణంగా మధ్యాహ్నం వరకు టిఫిన్స్ కూడా అందలేదన్నారు. అక్కడి నుంచే ఖైరతాబాద్ మండల ఉప విద్యాధికారి శామ్యూల్ రాజ్ తో సెల్ ఫోన్‌లో మాట్లాడి వార్డెన్‌పై ఫిర్యాదు చేశారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం



సీసీనగర్‌లోని ఎల్లమ్మ ఆలయం కమిటీ సభ్యులతో తలసాని

పద్మారావునగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి చాచా నెహ్రూనగర్‌లోని ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి కల్యాణోత్సవానికి ముఖ్యఅతిథిగా సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమానికి ఆలయ చైర్మన్ శాంతికుమార్, వెంకటేశన్‌రాజు, ప్రేమ్‌కుమార్, కుమార్ యాదవ్, వెంకట్, రాహుల్, మహేష్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

ఆలయాలను పరిశీలించిన అధికారులు



శ్రీవన దుర్గా ఆలయాన్ని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

పద్మారావునగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మహాకాళీ బోనాల జాతరకు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయం దుర్వినియోగం అవుతోందని, దీనిపై దేవాదాయశాఖ అధికారులు విచారించి, తగిన చర్యలు తీసుకోవాలని ఇటీవల కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో మంగళవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని పద్మారావునగర్ పార్క్, వెంకటాపురం కాలనీ, హమాల్‌బస్తీ, గాంధీ ఆసుపత్రి ప్రాంతాల్లో ఉన్న ఆలయాలను దేవాదాయ శాఖ అధికారులు శ్రీదేవి, సురేష్‌లు పరిశీలించి, ఆలయాల కమిటీ సభ్యులను కలసి వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఫిర్యాదు మేరకు ఆలయాలను పరిశీలించామని, పూర్తి వివరాలతో కూడిన నివేదికను దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్‌కు సమర్పిస్తామని వారు తెలిపారు. వివాదస్పదంగా ఉన్న ఆలయాలకు సంబంధించిన చెక్కులను ప్రస్తుతానికి జారీచేయమని తెలిపారు.

పీజీ విద్యార్థులకు మెగా ప్లేస్‌మెంట్



మెగా ప్లేస్‌మెంట్‌లో పాల్గొన్న యువతులు

అడ్డగుట్ట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ సెంటినరీ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ తెలంగాణ టీజీఓ అసోసియేషన్, స్ట్రాటెక్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పీజీ విద్యార్థుల కోసం మెగా ప్లేస్‌మెంట్ నిర్వహించామన్నారు. ఈ ప్లేస్‌మెంట్‌లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ప్లేస్‌మెంట్‌కు ముఖ్యఅతిథిగా రెవరెండ్ ఫాదర్‌తో పాటు ఈ కళాశాల డైరెక్టర్ అంథోనీ వినయ్, టీటీపీటీఏ అధ్యక్షుడు డాక్టర్ జయరామ్, సందీప్ పాల్గొన్నారు.

యువకుడికి 20రోజుల జైలు



ఆకుల విశాల్ (ఫైల్‌ఫొటో)

బౌద్ధనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తాగినమైకంలో ప్రజలను భయాభ్రాంతులు చేస్తూ అందరిపై దాడికి పాల్పడుతున్న ఓ యువకునికి 20రోజుల జైలుశిక్ష పడిన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం పార్సిగుట్ట సంజీవపురంకు చెందిన ఆకుల విశాల్(21) రెండు రోజుల క్రితం సంజీవపురంలో తాగినమైకంలో యుద్ధవాతావరణం సృష్టించి స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి శివపై దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు వారాసిగూడ పోలీసులు విశాల్‌పై ఈ-పెట్టి కేసును నమోదు చేసి మంగళవారం ఉదయం సికింద్రాబాద్‌లోని 15వ ప్రత్యేక కోర్టు మేజిస్ట్రేట్ రవిశంకర్ ముందు హాజరు పరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన మేజిస్ట్రేట్ రవిశంకర్, నిందితుడు విశాల్‌కు 20రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని చంచల్‌గూడ తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం



నాగేష్ (ఫైల్)

రెజిమెంటల్‌బజార్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ గిరిధర్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం రోజు మాదిరిగానే బయటకు వెళ్లిన నాగేష్(63) అనే వృద్ధుడు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో నాలుగు రోజుల క్రితం నుంచి తన పెద్దనాన్న కనిపించడం లేదని మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో నాగేష్ తమ్ముడి కుమారుడు ఫిర్యాదు చేశాడు. మార్కెట్ పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఏవరైన గుర్తిస్తే మార్కెట్ ఎస్సై గిరిధర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం..



నాగేష్ (ఫైల్)

కుమార్తె కనపడటం లేదని ఓ తండ్రి మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదివారం తన పెద్ద కూతురు గీతాంజలి(27), చిన్న కూతురు సికింద్రాబాద్ మోండా మార్కెట్‌కు షాపింగ్‌కు వెళ్లారని, పెద్ద కూతురు కనిపించడం లేదని తన చిన్న కూతురు ఫోన్ చేసి తెలిపినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. మార్కెట్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఏవరైనా గుర్తిస్తే మార్కెట్ ఎస్సై మహేశ్వరికి సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

కంటోన్మెంట్‌లో డ్రైనేజీ, నాలాల నిర్మాణానికి మోక్షం!



భావనా కాలనీ మీదుగా ప్రవహిస్తున్న నాలా

సికింద్రాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ వాసులకు శుభవార్త. తరచూ పొంగుతున్న మురుగునీటి కంపు, ఓపెన్ నాలాల వల్ల కలుగుతున్న అవస్థల నుంచి శాశ్వత ఉపశమనం లభించనుంది. కోట్లాది రూపాయల వ్యయంతో సమర్థవంతమైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, నాలాల పటిష్ట నిర్మాణానికి మోక్షం కలగనుంది. దాంతో దశాబ్దాల నుంచి కంటోన్మెంట్ ప్రజలు పడుతున్న బాధలకు విముక్తి కలగనుంది. కంటోన్మెంట్ రహదారుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అవసరమైన 24 ఎకరాల కంటోన్మెంట్ భూములకు ప్రత్యామ్నాయంగా రూ.303 కోట్ల వ్యయంతో ఈ అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అవసరమైన 24 ఎకరాల భూములను హెచ్‌ఎండీఏకు అప్పగించడానికి పచ్చజెండా ఊపిన కేంద్రం తాజాగా రూ. 303 కోట్ల మొత్తాన్ని కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా ఖాతాలో జమ చేయాల్సిన అవసరం లేకుండా, స్థానికంగా ప్రత్యేక ఖాతా తెరిచి దానిలో డిపాజిట్ చేసి, అభివృద్ధి పనులు చేపట్టడానికి అనుమతి ఇవ్వడం విశేషం.

దంగల్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

క్రీడాకారులకు అందుబాటులోకి రాని (కుస్తి) దంగల్ భవనం



జీ ప్లస్ వన్ పూర్తి కాని (కుస్తీ) దంగల్ భవనం



నిలిచిపోయిన కుస్తీ మైదాన్ పనులు

మారేడుపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి నెహ్రూనగర్ పార్క్ ఆవరణలో దాదాపు 1200 గజాల చదరపు విస్తీర్ణ స్థలంలో దంగల్ (కుస్తి) జీ ప్లస్ వన్ భవనాన్ని దాదాపు రూ.86 లక్షల వ్యయంతో ప్రభుత్వం పనులను ప్రారంభించారు. 2019లో మోండా డివిజన్ పరిధిలోని మారేడుపల్లి నెహ్రూనగర్ పార్క్ ఆవరణలో అప్పటి ప్రభుత్వం పూర్వకాలపు నాటి కుస్తి క్రీడను యువతకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రతిష్టాత్మకంగా దంగల్ కుస్తీ స్పోర్ట్స్ భవనాన్ని నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. 70 శాతం మేర పనులు పూర్తయినప్పటికీ మిగతా పనులు నిలిచిపోయాయి. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఏర్పడింది. దంగల్ మైదాన్ ఏర్పాటు చేయడానికి గుజరాత్, రాజస్థాన్ నుంచి కుస్తీ పోటీలు నిర్వహించేందుకు అక్కడి మట్టిని తీసుకురావాల్సి ఉంది. కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంపై జీహెచ్‌ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కాగా లక్షలాది రూపాయలు వెచ్చించి భవన నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మారేడుపల్లి రెసిడెన్షియల్ కాలనీవాసులు, సీనియర్ సిటిజన్స్ పార్క్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. అధికారులు శ్రద్ధ తీసుకొని దంగల్ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే కుస్తీ క్రీడలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రీడలను ఉత్సాహపరిచే పార్క్

నెహ్రూనగర్ పార్క్ ప్రాంగణంలో ఇప్పటికే మినీ క్రీడా మైదానం ఉంది. ఇక్కడ బాక్సింగ్, కరాటే, వాలీబాల్, త్రోబాల్, క్రికెట్‌లలో క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందుతుంటారు. వీటికి తోడు పక్కనే ఏర్పాటు చేస్తున్న దంగల్ స్పోర్ట్స్ భవనం అందుబాటులోకి రావడం తథ్యం. క్రీడలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పనులు ప్రారంభిస్తాం

నిలిచిపోయిన దంగల్ భవనం నిర్మాణ పనులు రెండు నెలల్లో చేపడతాం. సాంకేతికపరమైన ఇబ్బందులు, సదరు కాంట్రాక్టరు పనులను నిలిపివేయడం వంటి కారణాలతో పనులు నిలిచిపోయాయి. దాదాపు మరో రూ.30 లక్షల మేర పనులు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నాం. వీటికి త్వరలో టెండర్ పిలిచి పనులు ప్రారంభిస్తాం.

\- చంద్రశేఖర్, ఏఈ, జీహెచ్ఎంసీ

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. నగరంలో విషాద ఛాయలు

- రెండు కుటుంబాల్లో తీరని విషాదం
- జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న స్నేహితులు



శ్రీవెంకట్, తేజశ్విని, కుమార్తె మృద (ఫైల్)

పేట్‌బషీరాబాద్/సికింద్రాబాద్, మారేడుపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ తమ ఇద్దరు పిల్లలతో హాయిగా జీవితాన్ని గడుపుతున్నారు. అంతలోనే సంతోషాన్ని మృత్యువు కాటేసింది. భార్యా భర్తలతో పాటు వారిద్దరు పిల్లలు అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం నగర వాసులను తీవ్ర విషాదంలో నింపింది. రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రక్కు వారి కారును ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పిల్లలతో సహా అగ్నికి ఆహుతైన సంఘటన విషయం తెలిసిందే. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి లోని ఎన్‌సీఎల్ నార్త్ కాలనీకి చెందిన రవి, అనిత దంపతులకు కుమార్తె తేజశ్విని, కుమారుడు ఆకాశ్ ఉన్నారు. ఆకాశ్ అమెరికాకు వెళ్లి విద్యను పూర్తి చేసి అక్కడే సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తున్నాడు. అదేవిధంగా సికింద్రాబాద్ తిరుమలగిరిలోని జూపిటర్ కాలనీకి చెందిన పశుపతినాథ్, గిరిజల కుమారుడు శ్రీ వెంకట్, కూతురు దీపిక అమెరికాలోనే స్థిరపడ్డారు. ఇద్దరు పిల్లలు అమెరికాలోనే ఉండడంతోనే ఏడాది క్రితమే వారు వెళ్లి అక్కడే ఉంటున్నారు.

ఏడాది క్రితమే ఇల్లు కొనుగోలు

శ్రీవెంకట్, తేజస్వినిలకు 2012లో వివాహం జరగ్గా, వీరికి ఇద్దరు పిల్లలు. అమెరికాలోనే ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ డల్లాస్‌లో ఏడాది క్రితమే ఇంటిని కొనుగోలు చేసి అక్కడే నివాసముంటున్నారు. శ్రీవెంకట్ అక్క దీపిక అట్లాంటాలో ఉంటుంది. తేజశ్విని చిన్నాన్న నాగరాజు కూడా అట్లాంటాలోనే నివాసం ఉంటున్నాడు. దీంతో వీకెండ్ సెలవులు రావడంతో శ్రీవెంకట్ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి అట్లాంటాకు వెళ్లి ఆదివారం తమ కారులో తిరుగు ప్రయాణమయ్యారు.

పది నిమిషాల్లో హోటల్ గదికి చేరాల్సి ఉండగా

అక్క ఇంటి నుంచి బయలు దేరిన శ్రీవెంకట్, తేజస్విని దంపతులు తమ సొంత ఇంటికి చేరుకునేందుకు ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో మార్గమధ్యంలోనే ఒక హోటల్‌ను బుక్ చేసుకున్నారు. హోటల్ వద్దకు చేరుకునేందుకు మరో పది నిమిషాలు పట్టేది. అంతలోనే గ్రీన్ కౌంటీ సమీపంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రక్కు ఢీకొట్టడంతో కారులో మంటలు చెలరేగి అందులో ఉన్న కుటుంబమంతా సజీవదహనమైంది.

జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న స్నేహితులు

సికింద్రాబాద్ వాసవినగర్‌కు చెందిన శ్రీవెంకట్ చిన్నప్పటి నుంచి స్నేహితులతో ఎంతో సరదాగా గడిపేవాడు. అమెరికాలో ట్రక్కు ఢీకొని శ్రీవెంకట్ కుటుంబం దుర్మరణం చెందినట్టు తెలియడంతో అతని స్నేహితులు దిగ్భ్రాంతి చెందారు.

అంచెలంచెలు ఎదిగి

2000-2002లో ఇంటర్‌ను రత్న జూనియర్ కాలేజీలో, బీటెక్ డిగ్రీని జేఎన్‌టీయూలో 2002-06లో పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని సాధించారు. ఆ తర్వాత క్రమంగా పలు కంపెనీల్లో పని చేస్తూ అనుభవాన్ని తెచ్చుకున్న శ్రీవెంకట్ ప్రస్తుతం అమెరికాలో నివాసం ఉంటున్నాడని స్నేహితులు తెలిపారు. అదేవిధంగా ప్రమాదంలో మృతి చెందిన తేజస్వినితో పాటు చదువుకున్న వారు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తమ్ముడు కూన శ్రీనివాస్ గౌడ్ తేజస్విని క్లాస్‌మేట్‌కు జరిగిన సంఘటనను గుర్తు చేసుకొని ఎంతో బాధను వ్యక్తం చేశారు. తనతో పాటే జీడిమెట్ల విలేజ్‌లోనే తేజస్విని హైస్కూల్ వరకు చదువుకుందని తెలిపారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలి

తార్నాక, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం రూపొందిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సోమనబోయిన సింహాద్రి అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరును మంగళవారం తార్నాకలోని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ప్రొ. సింహాద్రి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు ఆధార్, రేషన్ కార్డు, వృద్ధాప్య పెన్షన్‌ను పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల పేద, దళిత, ఆదివాసీ, బీసీ, మైనార్టీలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తీసుకున్న ఈ నిర్ణయం కేంద్రంలోని బీజేపీ పార్టీకి లబ్ధి చేకూర్చే విధంగా ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా దేశ ప్రజలందరూ ఏకమై భారత ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దునుకు గోవర్ధన్, మహమ్మద్ రిజ్వాన్ హుస్సేన్, మహమ్మద్ వాజిద్ సిద్దికి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ కిట్స్ పంపిణీ



బౌద్ధనగర్ జీహెచ్ఎంసీ కమ్యూనిటిహాలులో పారిశుధ్య కార్మికులకు కిట్‌లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కందిశైలజ



సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పారిశుధ్య కార్మికులకు కిట్‌లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

బౌద్ధనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ సేఫ్టీ కిట్స్‌ను పంపిణీ చేశారు. మంగళవారం బౌద్ధనగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద స్థానిక కార్పొరేటర్ కంది శైలజ, సీతాఫల్‌మండి ఎమ్మెల్యే కార్యాలయం వద్ద స్థానిక కార్పొరేటర్ సామల హేమలు అధికారులతో కలిసి సేఫ్టీ కిట్స్‌ను అందజేశారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని వీటిని అందజేశామని కార్పొరేటర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ వెంకటేశ్, ఎస్ఎఫ్ఐ జవాన్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించాలి : సాద కేశవరెడ్డి

సికింద్రాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని, లేదంటే ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్‌ల ఇళ్లు ముట్టడిస్తామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్లుగా కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి ఎన్నికలు నిర్వహించకుండా కేంద్రం తాత్సారం చేస్తోందని విమర్శించారు. 8వార్డుల నుంచి ఎన్నికైన సభ్యులు ఉంటేనే యావత్ కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా కంటోన్మెంట్‌లో ప్రజాస్వామ్యాన్ని సైతం అపహాస్యం చేస్తున్నదని కేశవరెడ్డి ఆరోపించారు. దేశ విదేశాల్లో పర్యటిస్తూ, దేశం గురించి ఆలోచించే ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే స్పందించి, దేశంలోని అన్ని కంటోన్మెంట్లతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి ఎన్నికలు నిర్వహించేలా చొరవ చూపాలని ఆయన కోరారు. ఎన్నికల విషయమై తాము కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఎంపీ ఈటల రాజేందర్‌లకు వినతి పత్రాలు సమర్పించామని, హైకోర్టును కూడా ఆశ్రయించామని ఆయన తెలిపారు. మున్ముందు ఆందోళనకు సిద్ధం కావాలని నిర్ణయించామని, కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంతోపాటు ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్‌ల ఇల్లు ముట్టడించి, ఎన్నికల నిర్వహణ విషయమై వారి ద్వారా ఒత్తిడి తీసుకువస్తామని వెల్లడించారు.

కత్తితో దాడి చేసిన రౌడీషీటర్ అరెస్ట్




మహమ్మద్ అబ్దుల్ మజీద్


బోయినపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని కత్తితో పొడిచి హత్యాయత్నం చేయబోయిన ఓ రౌడీషీటర్‌ను బోయినపల్లి పోలీసులు అరెస్టు చేసినట్లు బేగంపేట్ ఏసీపీ గోపాల కృష్ణమూర్తి వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ సర్దార్ నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం బోయినపల్లి స్టార్ పాయింట్ గల్లీ హస్మత్‌పేట్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ సలాం అలియాస్ అబ్బు(25) సోమవారం రాత్రి బోయినపల్లి విజయదుర్గ వైన్స్ వద్ద బాగా మద్యం సేవించి అటుగా వెళ్తున్న వారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈక్రమంలో శ్రీసాయి ఎన్‌క్లేవ్‌కు చెందిన ఎండీ అబ్దుల్ మజీద్ అనే వ్యక్తి తన బైక్ పైన అటువైపుగా వెళ్తున్నాడు. బైక్‌ను అడ్డుకున్న అబ్దుల్ సలాం తన వద్ద ఉన్న(బటన్ చాకు) కత్తితో అబ్దుల్ మజీద్‌ను బెదిరిస్తూ డబ్బులను లాక్కునే ప్రయత్నం చేశాడు. దీంతో అబ్దుల్ మజీద్ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయగా, దీంతో అబ్దుల్ సలాం తన వద్ద ఉన్న కత్తితో అబ్దుల్ మజీద్‌ను విచక్షణ రహితంగా పొడిచి పారిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న బాధితుడిని స్థానికులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గంట వ్యవధిలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అయితే అబ్దుల్ సలాం ఓ రౌడీషీటర్ అని అతడిపై ఇప్పటికే అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు, బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో రౌడీ షీటర్‌గా కేసు నమోదు చేసుకున్న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

గస్తీ బైకును కారుతో ఢీకొట్టి డ్రైవర్ పరార్

- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు తిరుపతి రాజు, సర్దార్ నాయక్



సంపత్‌కుమార్ (ఫైల్)

బోయినపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గర్ల్ ఫ్రెండ్‌తో ఏకాంతంగా ఉన్న సమయంలో గస్తీకి వచ్చిన పోలీసులను ఢీ కొట్టి గాయాల పాలుజేసి పరారైన క్యాబ్ డ్రైవర్‌ను బోయినపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు తప్పించుకునే ప్రయత్నంలో ఉద్దేశపూర్వకంగా పోలీసుల గస్తీ బైక్‌ను ఢీ కొట్టి హత్యాయత్నం చేసి పారిపోయాడని బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ సర్దార్ నాయక్‌లతో కలిసి బోయినపల్లి పోలీస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. తిరుపతికి చెందిన నోచిన సంపత్ కుమార్ (25) మౌలాలి కృష్ణానగర్ రోడ్ నెంబర్ 5లో ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంపత్ ఓ క్యాబ్‌ను అద్దెకు తీసుకొని ఓలా / ఉబర్ యాప్‌లకు నడుపుతున్నాడు. సంపత్‌కు ఇప్పటికే రెండు పెళ్ళిళ్లు అయ్యాయి. సంపత్ తిరుపతిలో ఉంటున్న అతడి గర్ల్‌ఫ్రెండ్‌ను నగరానికి పిలిపించుకున్నాడు. బోయినపల్లి డైరీ ఫారమ్ రోడ్డులో ఈ నెల 5వ తేదీ యువతితో కలిసి కారులో ఏకాంతంగా ఉన్నాడు. ఈ సమయంలో విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్ కానిస్టేబుళ్లు చంటి, ప్రవీణ్‌లు బైక్‌పై వెళుతూ కారును గమనించారు. కారు వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకునేలోపే.. సంపత్ కారుతో పోలీసుల బైక్‌ను ఢీకొట్టి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో ప్రవీణ్ ఎడమ కాలు ఫ్రాక్చర్ కాగా, చంటికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన పోలీసులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ సమీపంలో ప్రమాదానికి కారణమైన కారును గుర్తించిన బోయినపల్లి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, కారును స్వాధీనం చేసుకున్నారు. పారిపోయేందుకే బైక్‌ను కారుతో ఢీ కొట్టానని నిందితుడు అంగీకరించాడని తెలిపారు. ఈకేసును ఛేదించిన బోయినపల్లి పోలీసులను ఏసీపీ అభినందించారు.

● నివాళులు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతిని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి మంగళవారం పంజాగుట్ట చౌరాస్తాలో డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి

● అమ్మవారికి బోనం



టీజేఏసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాలకట్ట మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల జాతరలో మంగళవారం ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాంతో కలిసి జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక బోనం సమర్పించారు.

\- తార్నాక, ఆంధ్రజ్యోతి

రైల్వే ఆస్పత్రిలో ఖాళీలు భర్తీ చేయాలి

చిలకలగూడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే బోర్డు నిబంధనలకు అనుగుణంగా లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల నూతన సిటీ స్కాన్ యంత్రం, ధన్వంతరి వార్డు, ఔషధ మొక్కల పార్క్ వంటి అభివృద్ధి పనులకు అనుగుణంగా ఉద్యోగులను నియమించలేదని, దీంతో సిబ్బందిపై అధికభారం పడుతుందని తెలిపారు. అత్యాధునిక యంత్రాల వినియోగానికి నిష్ణాతులైన సిబ్బంది అవసరమని తక్షణమే రైల్వే ఆస్పత్రిలో ఖాళీలను భర్తీ చేసి ఉద్యోగులు, పెన్షనర్లకి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని .కోరారు.